సాక్షి
చిత్తూరు
శనివారం । 6 । మే । 2023



వర్షానందం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. తిరుపతిలో సీఎంకప్ పోటీలకు హాజరైన క్రీడాకారులు వర్షంలో తడుస్తూ సందడి చేశారు.



విన్నర్స్

తిరుపతిలో శుక్రవారం నిర్వహించిన సీఎం కప్ టోర్నీ ఫైనల్స్ కబడ్డీలో విజయనగరం జట్టుపై గెలిచిన చిత్తూరు జిల్లా బాలికల జట్టు.

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	33	25
తిరుపతి	33	26
తిరుమల	28	22
గూడూరు	33	27
నగరి	33	26

న్యూస్‌రీల్

నేడు పది పరీక్షల ఫలితాలు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షల ఫలితాలు శనివారం విడుదల చేయనున్నారని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాలను 6వ తేదీ ఉదయం 11 గంటలకు రాష్ట్ర స్థాయిలో విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ విడుదల చేస్తారన్నారు. విద్యార్థులు www.results.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని తెలిపారు. మార్కులు తక్కువ వచ్చాయని, ఫెయిల్ అయ్యామనే కారణాలతో విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని మార్కులు సాధించేందుకు ప్రయత్నం చేసేలా తల్లిదండ్రులు భరోసా ఇవ్వాలని సూచించారు.

వరసిద్ధుని సేవలో న్యాయమూర్తులు



స్వామివారి చిత్రపటం అందుకుంటున్న సుప్రీంకోర్టు జడ్జి మహేశ్వరి దంపతులు



జస్టిస్ వెంకటరమణకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని న్యాయమూర్తులు శుక్రవారం దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, చిత్తూరు ఆర్డీఓ రేణుక, డీఎస్పీ శ్రీనివాస మూర్తి, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, చిత్తూరు కోర్టు న్యాయమూర్తులు, తహసీల్దార్ సుశీల పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతంలో అర్చకులు, భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరదరాజుల స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుద్ధపౌర్ణమి సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారిని సత్యనారాయణ స్వామి అలంకరణలో కొలువుదీర్చి వ్రతం నిర్వహించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సిరులతల్లికి 'స్వర్ణ'తేజం



స్వర్ణరథంపై దర్శనమిస్తున్న అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి) : తిరుచానూరు శ్రీపద్మావతిదేవి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ఉదయం స్వర్ణ రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువనే మేల్కొల్పి నిత్యకైంకర్యాలు సమర్పించారు. ఉదయం 9.10గంటలకు స్వర్ణరథ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం గోవిందనామ స్మరణ నడుమ శ్రీపద్మావతీదేవిని రథంపై కొలువుదీర్చారు. అమ్మవారు స్వర్ణరథంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం ఉద్యానవనం మండపంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణ నడుమ పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అర్చకులు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు సర్వాలంకార శోభితురాలైన శ్రీపద్మావతి అమ్మవారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వసంతోత్సవాల్లో చివరి రోజైన శనివారం మధ్యాహ్నం అమ్మవారికి స్నపన తిరుమంజనం జరిపించనున్నారు. రాత్రి 7.30 గంటలకు తిరుచ్చి వాహనసేవ నిర్వహించనున్నారు.

ఆదాయానికి 'డ్యూయెల్' జోష్

- ధరలుంటే మార్కెట్‌కు.. లేకుంటే ప్రాసెసింగ్‌కు
- పలమనేరు ప్రాంతంలో మొదలైన కొత్త రకం టమాట సాగు
- డ్యూయల్ టమాట సాగు పెంచేలా ఉద్యానశాఖ చర్యలు
- రైతుల్లో సాగుపై పెరుగుతున్న ఆసక్తి



చిన్నపేట కురప్పల్లె వద్ద వెంకటరమణ డ్యూయెల్ టమాటా తోట



నాణ్యంగా ఉన్న టమాటాలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

పలమనేరు: జిల్లాలోని పడమటి మండలాల్లో ఎక్కువగా సాగయ్యే టమాటాకు ధరల పరంగా హెచ్చుతగ్గులు రైతులను ఒక్కోసారి ఆనందడోలికల్లో నింపితే, మరోసారి కుదేలు చేస్తుంటాయి. ధరలు పతనమైనప్పుడు రైతులు కన్నీటిపర్యంతమవుతుంటారు. మార్కెట్లలో అమ్ముకోలేక రోడ్డున పడేయడమో లేదా తోటల్లోనే వదిలేయడమో చేస్తుంటారు. ఇకపై టమాట రైతులకు ఇలాంటి బాధ లేకుండా డ్యూయల్ పర్పస్ టమాట సాగు పెంచేలా స్థానిక ఉద్యానశాఖ కృషిచేస్తోంది. కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ వెజిటబుల్స్‌లో కొత్త రకాల టమాట వంగడాలను రైతులకు సబ్సిడీతో అందజేస్తోంది. దీంతో ఇక్కడి హార్టికల్చర్ అధికారులు రైతులకు వీటిని పరిచయం చేసి రెండు విధాలుగా ఉపయోగపడే టమాట పంట సాగును ప్రోత్సహిస్తున్నారు.

పలమనేరులో డ్యూయెల్ టమాట సాగు

జిల్లాలో టమాట సాగుకు ఏడాది పొడవునా అనుకూలమే అయినప్పటికీ అధికంగా వేసవిలో సాగు చేస్తారు. ప్రస్తుతం పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో 5,200 హెక్టార్లలో టమాట సాగవుతోంది. వర్షాలు బాగా కురిసి బోర్లలో నీటి మట్టం పెరిగింది. అదే స్థాయిలో ఈ పర్యాయం టమాట సాగు పెరిగింది. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ (ఐఐహెచ్ఆర్) బెంగళూరు రూపొందించిన అర్క రక్షక్, అర్క సామ్రాట్, రక్షక్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రీసెర్చ్ టమాట-10, ద ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఆఫ్ నేషనల్ హార్టికల్చర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ వారి అర్కసామ్రాట్, అర్కసౌరబ్‌తో పాటు సంకరజాతి రకాలైన గార్డెన్ టమాట, జగోరా, జింబో, సూపర్ స్వీట్ చెర్రీ-10, సన్‌గోల్డ్ తదితర రకాలను సాగు చేసేవారు. సింజెంటా వారి సాహో, ప్రభాకర్ హైబ్రిడ్ సీడ్స్ వారి సాహితి, ఈస్ట్‌వెస్ట్ కంపెనీ వారి శ్రేయ, జీవన్, సింజెంటా వారి 6242 సాగు ఎక్కువగా ఉంది. వీటిల్లోనూ 80 శాతం పంటతో సాహో తొలి స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో వీటిని కేవలం మార్కెట్లకు మాత్రమే రవాణా చేసి విక్రయించుకోవాలి. మార్కెట్‌లో ధర లేకుంటే రైతుకు నష్టాలు తప్పవికాదు. ఈ సమస్యపై దృష్టి సారించిన ఉద్యానశాఖ అటు మార్కెట్‌లో అమ్ముకోవడానికి ధర లేకుంటే జ్యూస్ ఫ్యాక్టరీలకు పంపేలా సింజెంటా కంపెనీకి చెందిన 6242 అనే డ్యూయెల్ రకాన్ని సాగు చేసేలా చూశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 50 ఎకరాల్లో ఈ రకం సాగవుతోంది.

ఇదిగో సాక్ష్యం

పలమనేరు మండలంలోని చిన్నపేట కురప్పల్లెకు చెందిన రైతు వెంకటరమణ స్థానిక హార్టికల్చర్ అధికారుల ద్వారా కుప్పం సీఓఈ నుంచి సబ్సిడీతో రూ.30 చొప్పున 18వేల సీడ్స్‌ను తన 2.5 ఎకరాల భూమిలో సాగుచేశాడు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. ఒక్కో కోతకు వెయ్యి బాక్సులు (బాక్సు 15కిలోలు) దిగుబడి వస్తోంది. ఈ లెక్కన ఎకరాకు 15 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం సాధారణ టమాటా ధర బాక్సు రూ.80 ఉండగా డ్యూయెల్ రకం రూ.135 నుంచి రూ.150 దాకా ఉంది. ధర తగ్గితే టమాట ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు అగ్రిమెంట్ ధరకు కొనుగోలు చేస్తాయి. దీంతో రైతుకు నష్టం వస్తుందనే దిగులు లేకుండా పోయింది. ఇతను సాగుచేసిన కొత్త రకాన్ని ఇటీవలే ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్ పరిశీలించి డ్యూయెల్ రకం టమాటా సాగును విస్తృతం చేయాలని జిల్లా అధికారులకు సూచించారు.



డ్యూయల్ పర్పస్ టమాట పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్(ఫైల్)

టమాట రైతులను ఆదుకునేలా మినీ ప్రాసెసింగ్ యూనిట్లు

తరచూ టమాటాకు గిట్టుబాటు ధర లేక రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గమనించింది. వీరికి గిట్టుబాటు ధర లభించేలా జపాన్ దేశ సాయంతో ఏపీ జీవనోపాదుల అభివృద్ధి పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా రైతులకు టమాట ప్రాసెసింగ్ యూనిట్లను 75 నుంచి 90 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తున్నారు. దీంతో ధరలు లేక సరుకు మార్కెట్‌లో అమ్ముడుపోనపుడు మినీ ప్రాసెసింగ్ యూనిట్లలో టమాట జ్యూస్, పౌడర్‌లాంటివి తయారుచేసి నిల్వ ఉంచుకోవచ్చు. మ్యాంగో ప్రాసెసింగ్‌లాగే టమాట ప్రాసెస్ చేసుకోవచ్చు. తద్వారా ధరలున్నప్పుడు జ్యూస్, పౌడర్‌లను పెద్ద కంపెనీలకు విక్రయించుకునే అవకాశం ఉంటుంది.

రెండు రకాలుగా అవకాశం ఉంటే ధైర్యం



నేను రెండున్నర ఎకరాల్లో డ్యూయెల్-6242 రకం టమాట సాగుచేశా. పంట దిగుబడి బాగా ఉంది. కాయ కాండం మందంగా ఉండడంతో సరుకు రవాణాకు ఇబ్బంది లేదు. ప్రస్తుతం స్థానిక మార్కెట్లే కాకుండా కర్ణాటకలోని పలు మార్కెట్లకు సరుకు వేస్తున్నా. ఒకవేళ ధరలు తగ్గితే ముందుగానే ఒప్పందం చేసుకున్న జ్యూస్ కంపెనీకి సరుకు వేస్తా. రెండు రకాల అవకాశం ఉంది కాబట్టి నష్టం వస్తుందనే భయం లేదు.

– వెంకటరమణ, చిన్నపేట కురప్పల్లె, పలమనేరు మండలం

డ్యూయెల్ టమాట సాగు పెంచుతున్నాం



గతంలో లాగా కాకుండా కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త వంగడాల సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలి. ఇప్పటికే పలమనేరు ప్రాంతంలో స్థానిక మార్కెట్లకు, ధర లేదంటే ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలకు తరలించే టమాటను రైతులు విరివిగా సాగు చేస్తున్నారు. ఇవి మంచి దిగుబడి వస్తుండడంతో ధర తగ్గినా రైతులకు గిట్టుబాటవుతుంది. రైతులకు 6242 రకం టమాట విత్తనాలను కుప్పంలోని ఎస్ఓఈలో సబ్సిడీతో అందిస్తున్నాం. రాబోవు రోజుల్లో ఇలాంటి రకాలకే డిమాండ్ ఉంటుంది.

– కోటేశ్వరరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు డివిజన్

'గంగ'రంగ వైభవం

ఆధ్యాత్మిక శోభతో తిరునగరి ఖ్యాతి ఇనుమడించింది.. వేదమంత్రోచ్చారణల నడుమ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకం పరిపూర్ణమైంది.. నూతనంగా నిర్మించిన దివ్యాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో యావత్ భక్తకోటి పులకించింది.. మహోత్సవం ముగియగానే వరుణుడు కుంభవృష్టి కురిపించడంతో పరవశించింది.. పుణ్యజలాల జల్లులో తడిసి పునీతమైంది.. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిమాన్విత ఘట్టంలో పీఠాధిపతులు పాలుపంచుకోవడం భక్తులకు నయనానందకరంగా మారింది.





అమ్మవారి తొలి దర్శనంలో స్వరూపానందేంద్ర స్వామి, కంచి పీఠాధిపతి అనుగ్రహ భాషణం

- పరిపూర్ణం.. మహా కుంభాభిషేకం
- కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి చేతులమీదుగా మహోన్నత ఘట్టం
- అమ్మవారి తొలి దర్శనంలో శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న మహా కుంభాభిషేక మహోత్సవం చివరి రోజు శుక్రవారం నాడు అమ్మవారి ప్రతిష్ఠతో ఘనంగా ముగిసింది. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో అత్యంత వైభవోపేతంగా మహా కుంభాభిషేక మహోత్సవం సాగింది. అనంతాళ్వార్ వంశీయులైన 22వ తరానికి చెందిన కస్తూరి రంగన్ ఆధ్వర్యంలో ఆరంభమైన కుంభాభిషేకంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 70 మంది వేద పండితులు పాల్గొన్నారు. గంగమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ సారథ్యంలో ప్రతి రోజు ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్విరామంగా వేదపారాయణం, యజ్ఞ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగో రోజు గురువారం సాయంత్రం గంగమ్మ తల్లి మూలవిరాట్‌ను యాగశాలలో జలాధివాసం చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి వారి కుటుంబసభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునికృష్ణయ్య, ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ కుంభాభిషేక సంబంధిత ప్రధాన కలశం, మహాకాళి మహాలక్ష్మి మహా సరస్వతి స్వర్ణ యంత్రాన్ని మంగళవాయిద్యాల నడుమ గర్భాలయానికి ప్రదక్షిణగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కుంభాభిషేకంలో పాల్గొనేందుకు కంచికామకోటి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతీ స్వామివారు, మంత్రి ఆర్‌కే రోజా విచ్చేశారు. వారికి ఎమ్మెల్యే భూమన పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నిర్ణయించిన శుభ పుష్కరాంశంలో జగద్గురువు విజయేంద్ర సరస్వతీ స్వామివారి అమృత హస్తాలతో స్వర్ణ యంత్ర స్థాపన, అమ్మవారి మూలవిరాట్ ప్రతిష్ఠ చేశారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయ విమాన శిఖర కలశ స్థాపన చేశారు. శిఖర కలశానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మంత్రి రోజా భూమన అభినయరెడ్డి కుంభాభిషేకం చేశారు. ఈ క్రమంలోనే మహాకుంభాభిషేకం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని తల్లిని తొలి దర్శనం చేసుకునేందుకు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతిస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి విచ్చేశారు. వారికి ఎమ్మెల్యే భూమన ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.



గోపుర కలశానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తోబుట్టువులకు 'కళ్యాణమస్తు'

- పండుగ వాతావరణంలో వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పంపిణీ
- మెగా చెక్కును అందజేసిన నగర మేయర్ అముద, కలెక్టర్ షణ్మోహన్



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : పేద కుటుంబాలకు చెందిన వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకునేలా వైఎస్సార్‌సీపీ సర్కారు ప్రోత్సహిస్తోందని నగర మేయర్ అముద అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా మంజూరును పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి ప్రారంభించారు. సీఎం ప్రసంగాన్ని వర్చువల్ విధానంలో లబ్ధిదారులు వీక్షించారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ టీడీపీ పాలనలో పథకాలను అమలు చేస్తామంటూ మాయమాటలు చెప్పి మోసగించారన్నారు. ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అర్హులైన వధువులందరికీ రూ.1,50,000 వరకు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రక్రియను జిల్లా స్థాయిలో పకడ్బందీగా అమలు చేసినట్లు చెప్పారు. కులాంతర వివాహాలు చేసుకున్న వధువులకు వారి ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెండవ విడతలో 421 మంది లబ్ధిదారులకు రూ.3.26 కోట్లు ప్రభుత్వం అందజేసిందని పేర్కొన్నారు. అనంతరం మెగా చెక్కును ప్రజాప్రతినిధులు, కలెక్టర్ కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, మహిళా శిశు సంక్షేమ స్థాయి సంఘ చైర్మన్ భారతి, డీఆర్డీఏ పీడీ తులసి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సామాజిక వర్గాల వారీగా . . .

జిల్లా వ్యాప్తంగా కళ్యాణమస్తు పథకం కింద రెండో విడతలో 159 మంది ఎస్సీలకు రూ.1.6 కోట్లు, 19 మంది ఎస్టీలకు రూ.19 లక్షలు, 204 మంది బీసీలకు రూ.1.07 కోట్లు, 37 మంది మైనారిటీలకు రూ.37 లక్షలు, ఇద్దరు దివ్యాంగులకు రూ.3 లక్షలు ప్రభుత్వం అందజేసింది.


జగనన్న అండగా నిలిచారు



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకం మాకు ఎంతగానో ఉపయోగపడింది. నా తండ్రి మృతి చెందారు. అమ్మ నన్ను డిగ్రీ వరకు చదివించింది. నా పెళ్లి చేసేందుకు అమ్మ ఎన్ని కష్టాలు పడుతోందో చెప్పలేను. ఇలాంటి సమయంలో జగనన్న వైయస్సార్ కళ్యాణమస్తు పథకాన్ని అమలు చేసి నా కుటుంబానికి అండగా నిలిచారు.

– ఎ.రేఖ, అంబేపల్లి, పూతలపట్టు మండలం

మేలు మరువలేం



నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. తండ్రి మరణించారు. ఎంతో కష్టపడి అమ్మ నన్ను చదివించింది. నా పెళ్లికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని వైఎస్సార్ షాదీ తోఫా పథకం ద్వారా ప్రభుత్వం అందించింది. నేడు ఈ పథకం ద్వారా రూ.లక్ష అందుకోవడం ఆనందంగా ఉంది. జగనన్న మేలు మరువలేం.

– ఫరీదా, రాంనగర్ కాలనీ, చిత్తూరు

సంతోషంగా ఉంది



పెళ్లికి ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఒక అన్నగా ఆడపిల్లలకు సీఎం అండగా ఉంటున్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు పథకంలో నేను లబ్ధి పొందడం సంతోషంగా ఉంది. పేదల గురించి ఆలోచించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– అమ్ములు, పెద కంటి పల్లి, జీడీ నెల్లూరు మండలం

ఎంతో ఉపయోగకరం



నేను ఇంటర్ వరకు చదువుకున్నా. పెద్దల అనుమతితో మేము కులాంతర వివాహం చేసుకున్నాం. నా భర్త ఫోటోగ్రాఫర్. నేడు జగనన్న అందించిన ఈ సాయం ఆర్థిక తోడ్పాటుకు వినియోగించుకుంటాం. ఒక అన్నగా చెల్లెలు భవిష్యత్తు గురించి ఆలోచించి సీఎం చేస్తున్న మేలును మరువలేను.

– పూర్ణ ప్రియ, చిత్తపార, గుడిపాల మండలం.

వైభవంగా కోనేటిరాయుని రథోత్సవం

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి రథోత్సవం కనులపండువగా సాగింది. ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. సువర్ణ కంఠాభరణాలతో అలంకార ప్రియుడైన శ్రీనివాసుడు రోజుకో వాహనంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఉత్సవాల్లో 8వ రోజు శుక్రవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత కోనేటిరాయుడు రథాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారి రథాన్ని లాగి పునీతులయ్యారు. సాయంత్రం శ్రీవారు సతీసమేతంగా ఊంజల్ సేవలో సేద తీరారు. రాత్రి శ్రీవారు అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రథోత్సవంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి పాల్గొన్నారు.



రథంలో విహరిస్తున్న స్వామివారు

అవినీతిపై ప్రశ్నిస్తే
మాపై నిందలేస్తారా?

● వాణిజ్యశాఖ అధికారి తీరుపై ఎమ్మెల్యే వెంకటేగౌడ ధ్వజం


మాట్లాడుతున్న పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: నియోజకవర్గంలోని వి.కోట మండలంలో వాహనాల తనిఖీ పేరిట వసూళ్లు మొదలెట్టిన వాణిజ్య పన్నులశాఖ అధికారి చేస్తున్న అవినీతిని ప్రశ్నించేందుకు వెళితే, తనపై లేనిపోని నిందలేస్తున్నారని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. వి.కోట మండలం తోటకనుమలోని తన నివాసంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడు నెలలుగా వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వాహనాల తనిఖీ పేరుతో మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. మూడు రోజుల క్రితం క్రిష్టాపురం గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ తనకు ఫోన్ చేశారన్నారు. ఆయన దుకాణానికి బిల్లులుతో కూడిన కూల్‌డ్రింక్స్‌ను తీసుకొస్తుండగా, ఏదో సాకు చూపించి, రూ.40 వేలు ఇవ్వాలని దశరథన్ అనే వ్యక్తి డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. అదే రోజు రాత్రి గ్రామంలో ఆలయానికి గ్రానైట్ లారీని ఆపి రికార్డులు లేవని రూ.లక్ష లంచం ఇవ్వాలని, లేకుంటే సీజ్ చేస్తామంటున్నారని గ్రామస్తుల నుంచి ఫోన్ వచ్చిందని పేర్కొన్నారు. దీంతో బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధిగా తాను వి.కోట సీఐ, ఎస్‌ఐలతో కలసి సంఘటనా స్థలానికి వెళ్లినట్లు చెప్పారు. అసలు వారందరూ నిజమైన అధికారులేనా కాదా అన్న సందేహంతో అక్కడే ఉన్న అసిస్టెంట్ కమిషనర్ ఇందిరాప్రియదర్శిని ప్రశ్నించగా, ఆమె సమాధానం చెప్పలేదన్నారు. వెంటనే ఆమె అక్కడినుంచి గ్రానైట్ వాహనాన్ని తరలించే ప్రయత్నం చేశారన్నారు. దీంతో గ్రామస్తులు ఆ వాహనాన్ని అడ్డుకున్నారని తెలిపారు. అక్కడే వీకోట సీఐకి దీనిపై విచారించాలని సూచించినట్లు వివరించారు. తాను కానీ, అక్కడున్న స్థానికులు కానీ, నాయకులు కానీ పోలీసులు కానీ, ఎవరూ దాడి చేయలేదని స్పష్టం చేశారు. కానీ వారిపై దాడి చేశారంటూ నింద లేయడం సబబు కాదన్నారు. కొన్నాళ్లుగా ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై బాధితులతో కలసి తాను వాణిజ్య శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అధికారుల నుంచి బెదిరింపులు ఎదుర్కొన్న బాధితులు మీడియాతో మాట్లాడారు.

వేగవంతంగా భూ సేకరణ

- పరిశ్రమల ఏర్పాటుకు మరింతగా సహకరించాలి
- అనుమతులు సకాలంలో ఇవ్వండి
- సమీక్ష సమావేశాల్లో కలెక్టర్ షణ్మోహన్ వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాల భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అభివృద్ధి కార్యక్రమాల భూసేకరణ అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి, ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఆ అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూ సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులకు నిర్వహిస్తున్న పనుల్లో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సబ్ స్టేషన్‌ల నిర్మాణానికి భూ కేటాయింపులు చేయాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. వెంటనే ఆప్రక్రియ పూర్తి చేసి ట్రాన్స్‌కో శాఖకు అప్పగించాలని తెలిపారు. బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకు ఫేజ్–2 , చిత్తూరు– తచ్చూరు రోడ్ల భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమీక్షలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో ఎన్.రాజశేఖర్, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ కార్తీక్ రెడ్డి, చిత్తూరు, కుప్పం, నగిరి ఆర్డీఓలు రేణుక, శివయ్య, సుజన, ఏపీఐఐసీ జెడ్ ఎం సోనీ, ట్రాన్స్‌కో ఈఈ శ్రీహరి, సెజ్ సీఐ జోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు మరింత సహకారం

జిల్లా వ్యాప్తంగా నూతన పరిశ్రమల ఏర్పాటుకు మరింతగా సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మరిన్ని పరిశ్రమలు నెల కొల్పేందుకు కావలసిన అన్ని వసతులను కల్పించాలన్నారు. అన్ని అనుమతులను సకాలంలో మంజూరుచేయాలని ఆదేశించారు. తద్వారా ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఉదయం పోర్టల్‌లో రూ.23.99 కోట్ల పెట్టుబడితో 146 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఆ పరిశ్రమల ఏర్పాటుతో 548 మందికి ఉపాధి లస్తుందని తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా మార్చి 25 నుంచి మే 4 వరకు 80 దరఖాస్తులు అందగా 49 దరఖాస్తులు ఎస్ఎల్ఏ స్థాయిలో ఆమోదం పొందాయన్నారు. మిగిలిన 31 పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు.

ప్రోత్సాహకాలు రూ.15.75 కోట్లు

ప్రోత్సాహకాల ద్వారా 61 క్లైములకు రూ.15.75 కోట్లు విడుదలకు సిఫారసు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఇందులో జనరల్ కేటగిరిలో 32 క్లైములకు రూ.14.01 కోట్లు, ఓబీసీ కేటగిరిలో 6 క్లైములకు రూ.8.97 లక్షలు, ఎస్ సి కేటగిరిలో 19 క్లైములకు రూ.1.22 కోట్లు, ఎస్టి కేటగిరిలో 4 క్లైములకు రూ.42.94 లక్షలు ప్రోత్సాహకాల విడుదలకు ప్రభుత్వానికి సిఫార్సు చేశామన్నారు.

175 యూనిట్లు మంజూరు

ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం క్రింద 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా 130యూనిట్లు లక్ష్యానికి గానూ 175 యూనిట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. రూ.5.79 కోట్లతో 158 యూనిట్లు, ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రియల్ బోర్డు ద్వారా 98 యూనిట్ల లక్ష్యానికి గానూ 37 యూనిట్లు మంజూరు కాగా, రూ.85.19 లక్షలతో 19 యూనిట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రియల్ కమిషన్ ద్వారా 56 యూనిట్లు లక్ష్యానికి గానూ 11 యూనిట్లు మంజూరు కాగా రూ.36.52 లక్షలతో 8 యూనిట్లు గ్రౌండ్ అయినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఐఐసీ జెడ్ఎం సోని సుహాన, లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషగిరి రావు, డీటీసీ నిరంజన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణా రెడ్డి, కమిటీ సభ్యులు గోవర్ధన్ బాబీ, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,000
రిటైల్ వెండి గ్రాము	రూ.81

గంగన్న శిరస్సులో వ్యక్తి గల్లంతు


త్యాగ (ఫైల్)

పలమనేరు: మండలంలోని మండిపేట కోటూరు అటవీ ప్రాంతంలో గంగన్న శిరస్సు జలపాతంలో వ్యక్తి గల్లంతైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తమిళనాడులోని గుడియాత్తానికి చెందిన త్యాగ(33) తన స్నేహితులతో కలసి మోర్ధన డ్యామ్‌కు వచ్చి అక్కడికి సమీపంలోని గంగనశిరస్సు జలపాతానికి వచ్చారు. అక్కడ ఈత కొడుతూ సుడిగుండంలో చిక్కుకొని కనిపించకుండా పోయాడు. దీంతో అతని సహచరులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే మృతదేహం కోసం పోలీసులు గాలించినా కనిపించలేదు. బహుశా మృతదేహం తమిళనాడుకు చెందిన మోర్ధన ప్రాజెక్టు వైపు కొట్టుకెళ్లి పోయిందేమోనని పలమనేరు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ, చిత్తూరు

ఆర్.ఓ.సి.నెం.69/2023 తేది: 05.05.2023

టెండరు ప్రకటన

చిత్తూరు మార్కెట్ యార్డు నందు 2023–2024 సంవత్సరములో మామిడికాయల సీజనులో మార్కెట్ యార్డు క్లీనింగ్ చేయుటకుగాను సీల్డ్ టెండరు ఆహ్వానించడమైనది. యార్డు క్లీనింగ్ పనులకు ధరావత్తు సొమ్ము రూ.10000/-**"Secretary, AMC, Chittoor"** వారి పేరిట డి.డిలను సమర్పించవలెను. లేనియెడల సీల్డు టెండరులో పాల్గొనుటకు అనుమతించబడరు. మరియు కార్యనిర్వాహక ఇంజనీరు(AM) వారు నిర్ణయించిన మొత్తము ఒక ట్రిప్పునకు రూ.884/- కన్నను తక్కువ కొటేషన్ వేసిన వారికి యార్డు క్లీనింగ్ పనులు కేటాయించబడును.

1. సీల్డు టెండరు ప్రారంభ తేది : 07.05.2023 ఉదయం 10.00గంటల నుండి
2. సీల్డు టెండరు ముగియు తేది : 11.05.2023 సాయంత్రం 5గంటల వరకు
3. సీల్డు టెండరు తెరువు తేది : 12.05.2023 మధ్యాహ్నం 3 గంటలకు

పూర్తి వివరములకు / కార్యాలయపు పనివేళలలో కార్యదర్శిని సంప్రదించవలెను. షరతులు వర్తించబడును.

సం/- ఇందుమతి, కార్యదర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ, చిత్తూరు

కన్నపేగుకే శిశువు భారమైందా?


చికిత్స పొందుతున్న పసికందు

నింద్ర : నవమాసాలు మోసి కన్న బిడ్డపై ఆ తల్లి మమకారం చంపుకుంది. గర్భం నుంచి ఈ లోకంలోకి అడుగుడిన శిశువును అనాథను చేసింది. చీమలు చుట్టుముట్టిన శిశువులను స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించి ప్రాణం నిలబెట్టారు. ఇలాంటి అమానవీయ సంఘటన మండలంలో గురువారం రాత్రి వెలుగుచూసింది. మండల కేంద్రంలోని సినిమా థియేటర్ సమీపం రోడ్డును ఆనుకొని ఉన్న బస్‌షెల్టర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన మగశిశువును వదిలిపెట్టి వెళ్లారు. వెంటనే చుట్టుముట్టిన చీమలు కుట్టడంతో బిడ్డ గుక్కపట్టి ఏడ్వడం ప్రారంభించింది. ఇది విన్న స్థానికులు బిడ్డను గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే చీమలు ఎక్కువగా కుట్టేయడంతో 108 వాహనంలో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో శుక్రవారం వరకు చికిత్స అందించిన వైద్యులు అనంతరం స్విమ్స్ చిల్డ్రన్ కేర్‌కు తరలించారు. బిడ్డ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన అనంతరం వారు ఐసీడీఎస్‌కు బిడ్డను అందజేసినట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు. ప్రస్తుతం బిడ్డ ఆరోగ్యంగా ఉందన్నారు. దీనిపై పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.

చీటీల పేరుతో టోకరా

● రూ.50 లక్షలతో ఉడాయించిన మాయలేడి
● పోలీసులను ఆశ్రయించిన బాధితులు



ఎస్ఐ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బాధితులు, (ఇన్‌సెట్) పరారీలో ఉన్న అన్నపూర్ణ(ఫైల్)

పలమనేరు: చీటీల పేరిట రూ.50 లక్షల దాకా డబ్బులు వసూలు చేసి మోసం చేసిన సంఘటన శుక్రవారం పలమనేరు పట్టణంలో వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గంటావూరు కాలనీలో నారాయణ భార్య అన్నపూర్ణ స్థానిక కాలనీ వాసులతో స్నేహంగా ఉండేది. చీటీలు నడపుతూ కాలనీ వాసుల్లో నమ్మకాన్ని పెంచుకొంది. దీంతో చాలామంది ఆమె వద్ద చీటీలను వేయడంతో పాటు వడ్డీలకు సైతం ఇచ్చేది. ఈ క్రమంలో కొన్నాళ్లుగా వారి ఇంటికి తాళం వేసి ఉండడంతో బాధితులు ఫోన్ చేయడం, తాము ఊరెళ్లామని వారంలో వస్తామంటూ అన్నపూర్ణ నమ్మించడం రివాజుగా మారింది. గత మూడు రోజులుగా అన్నపూర్ణ ఫోన్ స్విచ్ ఆఫ్‌చేసి ఉండడంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు ఎస్ఐ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా కొంగోళ్లపల్లి బాలాజీకి రూ.27లక్షలు, లక్ష్మికి రూ.5 లక్షలు, కుముదాకు రూ.రెండు లక్షలు, ఇలా పలువురుకి రూ.50 లక్షల దాకా ఇవ్వాలని బాధితులు పోలీసులకు తెలిపారు. దీనిపై ఎస్ఐ సుబ్బారెడ్డి విచారిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం , మృతుడి షర్ట్, టవల్

పూతలపట్టు: చిత్తూరు–తిరుపతి రహదారిలోని పూతలపట్టు చెరువు సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. అయితే ఆ వ్యక్తి గురువారం రాత్రి చిత్తూరు నుంచి బస్సులో పూతలపట్టుకు వచ్చి మృతి చెందినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. అతని శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, మెరూన్ కలర్ షర్ట్, టవల్ ధరించినట్లు చెబుతున్నారు. ఎవరైనా మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిస్తే 9440796719ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

దుకాణంలో రూ.1.7లక్షల చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లె పరిధిలోని ప్రశాంత్ చెప్పుల దుకాణంలో నగదు చోరీ అయిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. వన్‌టౌన్ సీఐ నరసింహరాజు కథనం మేరకు, యాదమరికి చెందిన దిలీప్ యథావిధిగా గురువారం రాత్రి చెప్పుల దుకాణానికి తాళం వేసుకుని ఇంటికెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం షాపు తెరిచేందుకు రాగా, తాళాలు పగలగొట్టి రూ. 1.7 లక్షల నగదును చోరీ చేసినట్లు గుర్తించాడు. వెంటనే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

డివైడర్‌ను ఢీకొన్న వ్యాన్.. డ్రైవర్ మృతి


చిదంబరం(ఫైల్)

పూతలపట్టు: మండలంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఎస్ఐ హరిప్రసాద్ వివరాల మేరకు పూతలపట్టు మండలం వడ్డేపల్లె పంచాయతీ బోడిరెడ్డి కండ్రిగ హరిజనవాడ చెందిన బి.చిదంబరం(45) టాటా మినీ వ్యాన్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. శుక్రవారం రాత్రి 9 గంటలకు పని నిమిత్తం వ్యాన్‌లో తిరుపతికి బయలుదేరాడు. మార్గమధ్యంలో పి.కొత్తకోట సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలై సంఘటన స్థలంలోనే అతను మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రుయాలో స్టాఫ్ నర్సుల ఆందోళన

● పరిపాలనాధికారి తీరుపై నిరసన


రుయా పరిపాలన అధికారి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

తిరుపతి తుడా : తిరుపతి రుయా ఆస్పత్రిలో పరిపాలన అధికారి తీరుపై స్టాఫ్ నర్సులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సూపరింటెండెంట్ నాగ మునీంద్రుడు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వీక్లీ ఆఫ్ మంజూరుకు తప్పనిసరిగా తన అనుమతి తీసుకోవాలని రుయా పరిపాలన అధికారి హుకుం జారీ చేశారని నర్సులు మండిపడ్డారు. నర్సింగ్ సూపరింటెండెంట్ల మధ్య పరిపాలన అధికారి విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఏఎన్ఎం, ఎఫ్ఎం విధులను సైతం స్టాఫ్ నర్సులు చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని, ఏదైనా సమస్యలు చెప్పుకునేందుకు వెళితే ఇష్టానుసారం మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతసేపు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఇబ్బందులకు గురి చేస్తున్న రుయా పరిపాలన అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్టాఫ్ నర్స్ అసోసియేషన్ ప్రతినిధి భువనేశ్వరి వివరించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సంతకాలు సేకరించారు. వేధింపులు మానకపోతే పూర్తిగా విధులను బహిష్కరించి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

‘జగనన్నే మా భవిష్యత్’ ఓ సువర్ణాధ్యాయం


ఇంటి పట్టా పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి


వైఎస్సార్‌సీపీ నాయకులతో వాగ్వాదానికి దిగిన టీడీపీ కార్యకర్తలు

● వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి 1.1 కోట్ల కుటుంబాల మద్దతు
● డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: వైఎస్సార్ సీపీ చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం దేశ చరిత్రలోనే ఓ సువర్ణ అధ్యాయంగా నిలిచిందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. ఇంటిపట్టాలు లేకుండా 40 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న బలిజకండ్రిగ సమీపంలోని దాసరి కాలనీవాసులకు శుక్రవారం డిప్యూటీసీఎం పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు పేరుతో చేపట్టిన పీపుల్స్ సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా 1.1 కోట్ల కుటుంబాలు జగన్ సర్కార్‌కు మద్దతు తెలిపాయన్నారు. జగన్ పాలనపై రాష్ట్ర జనాభాలో 80 శాతం మంది ప్రజలు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు సంస్కార హీనుడిగా మారి తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని పండిపడ్డారు. ప్రజల మద్దతుతోనే ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అతికించారని, ఇందులో ఎవరినీ బలవంతం చేయడం లేదని స్పష్టం చేశారు. ఈ నెల 9వ తేదీ నుంచి ‘జగనన్నకు చెబుదాం’ పేరుతో మరో నూతన కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, నాయకులు షణ్ముగరెడ్డి, రవిరెడ్డి, సుబ్రమణ్యారెడ్డి, పుత్తూరు కేశవరెడ్డి, మురళి, సుందరరాజు, తహసీల్దార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల వీరంగం

మండలంలోని నిశ్శింకాపురం(కమ్మపాళెం)లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున తోరణాలు, పార్టీ జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళుతున్న సమయంలో టీడీపీ నాయకులు రవినాయుడు, విజయ కుమార్ నాయుడు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. దీంతో టీడీపీ నాయకులకు, వైఎస్సార్ సీపీ నాయకులకు వాగ్వాదం చోటుచేసుకుంది.